క్లుప్తంగా

10న ఉయ్యూరులో జాబ్ మేళా

ఉయ్యూరు: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ, నాక్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 10న ఉయ్యూరులో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.నరేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఉయ్యూరు బస్టాండు సెంటరు సమీపంలోని నాక్ సెంటరులో జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. మోహన్ సింటెక్స్ ఇండియా లిమిటెడ్, కురాకు ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇతర కంపెనీలు పాల్గొంటాయని, ఆయా కంపెనీల్లో ఉద్యోగాలకు 7 నుంచి 10 వ తరగతి, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన 18–35 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు.

ప్రజా నాట్య మండలి క్యాలెండర్ ఆవిష్కరణ



పెనమలూరు: ప్రజా నాట్యమండలి క్యాలెండర్‌ను మంగళవారం పోరంకిలో ఆవిష్కరించారు. గ్రామంలోని డాక్టర్ గరికపాటి రాజారావు విగ్రహం వద్ద క్యాలెండర్‌ను ఆవిష్కరించి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి షేక్ కాశిం, ప్రజా నాట్య మండలి గ్రామ అధ్యక్షుడు కొండబాబు, అనుమోలు ట్రస్టు చైర్మన్ అనుమోలు ప్రభాకరరావు, సీపీఎం నేతలు ఉప్పాడ త్రిమూర్తి, షేక్ మస్తాన్‌వలి, మస్తాన్ పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీతిరుపతమ్మ సేవా సదనం నిర్మాణానికి భక్తుల విరాళం

గన్నవరం: స్థానిక పాత గన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న సేవా సదనం నిర్మాణానికి మంగళవారం భక్తులు రూ.లక్ష విరాళాలు ఇచ్చారు. అమెరికాకు చెందిన ప్రవాసాంధ్రులు కొణసాని శేఖర్‌బాబు, అరుణ దంపతులు రూ.50,116, కొణసాని సాంబశివరావు, రంగభారతి రూ.50,116 విరాళంగా ఇచ్చినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తెలిపారు. ఫిబ్రవరిలో జరిగే అమ్మవారి వార్షిక కల్యాణానికి సేవా సదనం అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు.

విద్యార్థులు జ్ఞానాన్వేషణ చేయాలి

ఉయ్యూరు: విద్యార్థులు భగవద్గీతలోని తాత్విక జ్ఞానాన్ని అర్థం చేసుకోవాలని గుడివాడ ఏఎన్ఆర్ కళాశాల ప్రొఫెసర్ ఎంబీ సువర్చల అన్నారు. ఏజీ అండ్ ఎస్‌జీ సిద్ధార్థ డిగ్రీ కాలేజీలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో భగవద్గీత ప్రాముఖ్యతపై మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివనాథ్, ప్రత్యేక అధికారి కె.సత్యనారాయణ, పీజీ రసాయన శాస్త్ర శాఖాధిపతి డాక్టర్ వీఎస్‌వీ కిషోర్, అధ్యాపకులు కె.రమేష్, ఎంవీ శాంతి, దిల్‌షాద్ బేగం, ఎం.రేఖ పాల్గొన్నారు.

నేడు విజయవాడ రూరల్ మండల పరిషత్ సమావేశం

విజయవాడ రూరల్: మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బి.బిగ్గీస్స్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి అధ్యక్షతన జరిగే సమావేశంలో మండలంలోని అభివృద్ధి పనులపై సమీక్ష జరుగుతుందన్నారు. సమావేశానికి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

వికాస్ డిప్లొమో విద్యార్థుల ప్రతిభ

నున్న(విజయవాడ రూరల్): స్థానిక వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో చివరి ఏడాది డిప్లమో విద్యార్థులు ఐదవ సెమిస్టర్‌లో స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రకటించిన ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల కార్యదర్శి ఎస్.సత్యనారాయణరెడ్డి మంగళవారం తెలిపారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో డి.శ్రీలత 97 శాతం మార్కులు, జి.సాయి తేజ 95 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. ఈ విభాగంలో మొత్తం 58 మంది విద్యార్థులకు గాను 52 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, ఒక విద్యార్థి ఐఓటి సబ్జెక్టులో 100 శాతం మార్కులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎన్.గోపాలకృష్ణతో కలిసి ఆయన అభినందించారు.

మహిళా ఉద్యోగులకు అదనపు సెలవులపై హర్షం

గన్నవరంరూరల్: గ్రంథాలయాల్లో పని చేస్తున్న మహిళా ఉద్యోగులకు అదనపు సాధారణ సెలవులు మంజూరు చేయటంపై కృష్ణా జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.కృపానందం హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల చేయడానికి కృషి చేసిన గ్రంథాలయ శాఖ జిల్లా కార్యదర్శి వేములపల్లి రవికుమార్, ఏపీ పౌర గ్రంథాలయ శాఖ సంచాలకులకు కృతజ్ఞతలు తెలిపారు.

అభయాంజనేయుని సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం ఆరుగొలను గ్రామానికి చెందిన వేటుకూరి వెంకట రమణరాజు, శృతి దంపతులు ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నిస్సిగ్గుగా బరి తెగింపు

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల మైదానాలు కేవలం జాబ్ మేళాలు నిర్వహణకు తప్ప ఎటువంటి సమావేశాలు, సభలు నిర్వహించేందుకు కాదని సాక్షాత్తూ రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ గతంలో ఓ సందర్భంలో వెల్లడించారు. అయితే ఇందుకు భిన్నంగా టీడీపీ శ్రేణులు బరితెగించాయి. సంక్రాంతి బరుల నిర్వహణకు ఏకంగా ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాల క్రీడా మైదానాన్ని దున్నేశాయి. కూటమి పెద్దల సహకారంతో సంక్రాంతి సంబరాల పేరుతో బరులను చకచకా సిద్ధం చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడకపోవటం గమనార్హం.

- క్రీడా ప్రాంగణంలో సంక్రాంతి బరుల ఏర్పాట్లు
- కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం



ఆకునూరులోని ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కాలేజ్‌లకు చెందిన క్రీడా ప్రాంగణం

ఉయ్యూరు: సంక్రాంతి సందర్భంగా కోడి పందేలకు బరులు ఏర్పాటుచేసేందుకు కూటమి నేతలు తహతహలాడుతున్నారు. ఇందులో భాగంగానే మండలంలోని ఆకునూరు గ్రామంలో ఆగమేఘాల మీద బరిని ఏర్పాటుచేస్తున్నారు. అయితే ఆ బరి ఏర్పాటుకు ఎంపిక చేసిన ప్రాంగణం విమర్శలకు కారణమవుతోంది. గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉన్న క్రీడా ప్రాంగణంలో సంక్రాంతి బరి ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ట్రాక్టరుతో మైదానాన్ని దున్ని చదును చేశారు. బరుల ఏర్పాటుకు అనుగుణంగా మైదానాన్ని సిద్ధం చేసే క్రమంలో సిమెంటు స్తంభాలు తరలించారు. పండుగ ముందు ఈ ప్రాంగణంలోనే సంబరాలు నిర్వహించే పేరుతో భారీ స్థాయిలో కోడి పందేలు, జూదాలు నిర్వహించేందుకు టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నాయి. ఇప్పటికే కోడిపందేలు, జూదాలకు సంబంధించిన ఒప్పందాలు కూడా జరిగినట్లు తెలుస్తోంది.

పత్తా లేని అధికారులు



బరుల ఏర్పాటులో భాగంగా సిద్ధం చేసిన సిమెంటు స్తంభాలు

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్వయంగా ప్రభుత్వ విద్యాసంస్థలకు సంబంధించిన ప్రాంగణాల వినియోగంపై స్పష్టమైన ప్రకటన కూడా చేశారు. సభలు, సమావేశాలు నిర్వహించటానికి వీల్లేదని ప్రకటించారు. టీడీపీ తమ్ముళ్లు మాత్రం పాఠశాల క్రీడా మైదానంలో ఏకంగా సంక్రాంతి బరులనే ఏర్పాటు చేసి సొమ్ము పోగేసుకునేందుకు రెడీ అయిపోయారు. ఓ వైపు కోడిపందేలు, జూదం నిర్వహణకు బరులు ఏర్పాటు చేస్తే చర్యలు ఉంటాయని మండల స్థాయి టాస్క్ ఫోర్సు టీంల పేరుతో అధికారులు ప్రకటనలు జారీ చేసి బ్యానర్లను ఆవిష్కరించారు. మరో వైపు ఆకునూరు కేంద్రంగా ప్రభుత్వ విద్యాసంస్థ ప్రాంగణంలో సంక్రాంతి బరి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నా అడ్డుకునే ధైర్యం కానీ, ఆపే ఆలోచన కానీ అధికారులు చేయకపోవటం విడ్డూరంగా ఉందని గ్రామస్తులు వ్యాఖ్యానిస్తున్నారు.

పెనమలూరు ఓటర్ల జాబితా ప్రకటన

- మహిళలు అధికం
- తాడిగడపలో అత్యధిక ఓట్లు



ఓటర్లు (ఫైల్)

పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గ ఓటర్ల జాబితాను అధికారులు ప్రకటించారు. పెనమలూరు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,95,051 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 1,42,389 మంది, మహిళలు 1,52,660 మంది, ట్రాన్స్ జెండర్‌లు ఇద్దరు ఉన్నారు. గత ఎన్నికల సమయంలో ఉన్న ఓట్లకంటే అదనంగా 123 మంది పెరిగారు. రూరల్ ప్రాంతం కన్నా అర్బన్ ఓటర్లుఎక్కువగా ఉన్నారు. వివరాల్లోకి వెళితే... పెనమలూరు నియోజకవర్గంలో తాడిగడప మున్సిపాలిటీ, పెనమలూరు, కంకిపాడు మండలం ,ఉయ్యూరు రూరల్, అర్బన్ ప్రాంతాలు ఉన్నాయి. అయితే నియోజకవర్గంలో అత్యధికంగా తాడిగడప మున్సిపాలిటీలో 125 పోలింగ్ కేంద్రాలలో 1,37,665 మంది ఓటర్లు ఉన్నారు. ఉయ్యూరు అర్బన్‌లో 32,766 మంది, పెనమలూరు మండలంలో 39,186 మంది, కంకిపాడు మండలంలో 55,479 మంది, ఉయ్యూరు రూరల్‌లో 29,955 మంది చొప్పున ఓటర్లు నమోదయ్యారు.

మహిళా ఓటర్లే అధికం

నియోజకవర్గంలో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. పురుషులు 1,42,389 మంది, మహిళలు 1,52,660 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 8,271 మంది అధికంగా ఉన్నారు. ప్రాంతాల వారీగా ఓటర్ల పూర్తి వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

పేరు	పీఎస్‌లు	పురుషులు	స్త్రీలు	టీజీలు	మొత్తం
తాడిగడప	125	67,213	70,451	1	1,37,665
పెనమలూరు	42	18,706	20,480	-	39,186
కంకిపాడు	64	26,395	29,083	1	55,479
ఉయ్యూరు రూరల్	37	14,310	15,645	-	29,955
ఉయ్యూరు అర్బన్	37	15,765	17,001	-	32,766
	305	1,42389	1,52,660	2	2,95,051

13 నుంచి పేరంటాలమ్మ ఆలయంలో సంక్రాంతి ఉత్సవాలు



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ ఈఓ ప్రియాంక తదితరులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈ నెల 13 నుంచి సంక్రాంతి జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమవుతాయని ఆలయ కార్యనిర్వహ ణాధికారి పి.ప్రియాంక తెలిపారు. ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఆమె విలేకరుల సమావేశాన్ని నిర్వహించి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా సంక్రాంతి ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 13న భోగి సందర్భంగా ఉదయం 5గంటల నుంచి ఆలయ దర్శనం, వాహన పూజలు, మొక్కుబడుల కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 14న మకర సంక్రాంతి రోజు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, కుంకుమ పూజలతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, అదే రోజు సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 18న ఆలయ సమీపంలోని రైవస్ కాలువలో తెప్పోత్సవం, రాత్రి రావిచెట్టు ఎదుట పూలంగి (ఊయల) సేవ జరుగుతుందని వివరించారు. 20న ఆలయంలో ఉత్సవాల ముగింపు సందర్భంగా అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. గ్రామోత్సవానికి సంబంధించి రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశామని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయంలో క్యూలైన్లు, తాగునీటి వసతి, మొక్కుబడులు చెల్లించుకునేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని వివరించారు. ఉత్సవాలు విజయవంతం కావడానికి రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామస్తులు, భక్తులు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. సమావేశంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యాధికారిపై గ్రామస్తుల ఫిర్యాదు



డీఎంహెచ్‌ఓ శర్మిష్ఠకు ఫిర్యాదు చేస్తున్న పెనమలూరు గ్రామస్తులు

పెనమలూరు: పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బిజిలి శ్రీనివాసరావుపై పెనమ లూరు గ్రామస్తులు, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు మంగళవారం పెనమలూరు పీహెచ్‌సీకి వచ్చిన జిల్లా వైద్యాధికారి శర్మిష్ఠకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిర్యాదును జిల్లా కలెక్టర్‌కు కూడా పంపారు. గ్రామస్తులు తమ ఫిర్యాదులో వివరాలు తెలుపుతూ వైద్యాధికారి బి.శ్రీనివాసరావు విధుల్లో ఉన్న సమయంలో మద్యం తాగుతున్నారని, వాచ్‌మన్‌తో కలిసి గ్రామ పొలిమేరలో మద్యం దుకాణం, కల్లు దుకాణం వద్ద మద్యం తాగుతూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో డీఎంహెచ్‌ఓ శర్మిష్ఠ పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసరావుకు ఉన్న డీడీఓ పవర్స్ రద్దు చేసి ఆయనపై విచారణకు ఆదేశించారు. ఫిర్యాదు చేసిన వారిలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు చిగురుపాటి శ్రీనివాసరావు, యలమంచిలి ప్రసాద్, టీడీపీ నేతలు కోయా ఆనంద్‌ప్రసాద్, కిలారు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

10న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా

గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 10వ తేదీన ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ–సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ నరేష్‌కుమార్ మంగళవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఇన్నోవ్ సోర్స్ సర్వీసెస్, టెక్నో టాస్క్ బిజినెస్ సొల్యూషన్స్, అపోలో ఫార్మసీస్ వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ పూర్తి చేసిన 18 నుంచి 30 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారు ఈ జాబ్‌మేళాకు అర్హులుగా తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12 నుంచి రూ.25 వేల వరకు వేతనం ఇతర సౌకర్యాలతో కూడిన ఉద్యోగం కల్పించనున్నట్లు వివరించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఏపీజీటీవీ.ఇన్/యూజర్–రిజిస్ట్రేషన్ లింక్ ద్వారా పూర్తి వివరాలతో రిజిస్టర్ కావాలని సూచించారు. జాబ్‌మేళాకు బయోడేటా, ఆధార్, పాన్, సర్టిఫికెట్లతో హాజరుకావాలని, ఇతర సమాచారం కోసం 9494005725 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఎన్నికల్లో యార్లగడ్డ రూ.120 కోట్లు ఖర్చు చేశారు!

టీడీపీ ఎమ్మెల్యేపై స్వపక్షీయుల వ్యాఖ్యలు

గన్నవరం: ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు గత ఎన్నికల్లో రూ.120 కోట్లు ఖర్చు చేసినట్లుగా టీడీపీ నేతలు అనడం వివాదాస్పదమైంది. స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ నేత, ఎస్ఎస్‌పీ ఎడమ కాలువ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు ఈ విధంగా వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి

క్రీడా పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం



పెనమలూరు: ఫిట్ ఇండియా క్రీడల పోటీల్లో విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో గత రెండు రోజులుగా కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో పురుషులకు, మహిళలకు వాలీబాల్ కబడ్డీ, రన్నింగ్, షటిల్, తదితర పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు జిల్లా యువజన అధికారి సుంకర రాము బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా... పట్టించుకోని అధికారులు



కంకిపాడు తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. కంకిపాడు పట్టణంలోని ఒకటో తూము వద్ద తాగునీటి పైపు లైను పగిలింది. గత మూడు రోజులుగా తాగునీరు వృథాగా పక్కనే ఉన్న పంట కాలువలో కలుస్తోంది. నిత్యం ఆ వైపుగా రాకపోకలు సాగించే అధికారులు చూసి కూడా కనీసం పగిలిన పైపులైనును, నీటి వృథాను అరికట్టేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

ఘనంగా ధనుర్మాస వ్రతం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ కుటుంబ సభ్యురాలు, మాజీ సర్పంచ్ కాకాని అరుణ నేతృత్వంలో ధనుర్మాస వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. గోదాదేవి అమ్మవారికి జీయర్ గోష్ఠి తరఫున సారె అందించారు.

రూ.2 లక్షల విలువ చేసే వైద్య పరికరాలు అందజేత

పెనమలూరు: పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎస్‌బీఐ సహకారంతో హైదరాబాద్‌కు చెందిన ఎవేర్ ఎన్జీవో సంస్థ సుమారు రూ.2 లక్షలు విలువ చేసే అత్యాధునిక వైద్య పరికరాలు, స్టేషనరీ వస్తువులను మంగళవారం వైద్యాధికారి బిజిలి శ్రీనివాసరావుకు అందజేశారు.

వైద్య ఖర్చులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



పోరంకిలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు: నియోజకవర్గంలో అనారోగ్యంతో ఉన్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే బోడెప్రసాద్ పంపిణీ చేశారు. పోరంకిలో తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రూ.10,14,318 విలువ చేసే చెక్కులను బాధితులకు అందజేశారు. పేదల వైద్య ఖర్చులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందని ఎమ్మెల్యే ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, మారుపూడి ధనకోటేశ్వరరావు, వెలగపూడి శంకర్‌బాబు, కోయా ఆనంద ప్రసాద్, సుంకర రమేష్, పీతా గోపీచంద్, పలువురు పాల్గొన్నారు.

పంటల సాగులో సస్యరక్షణ చర్యలు



పోరంకిలో రైతులతో మాట్లాడుతున్న ఏవో శైలజ

పెనమలూరు: పంటల సాగులో రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టి ఆశించిన దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ అన్నారు. ఆమె మంగళవారం పోరంకి, కానూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో శైలజ మాట్లాడుతూ మొక్కజొన్న, మినుము పంటలకు పచ్చ పురుగు, తెగుళ్లు ఆశించకుండా రైతులు అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు వాడే ఎరువులు, కలుపు మందులు, పురుగు మందులు తగిన మోతాదులోనే వాడాలని సూచించారు. ప్రస్తుతం వస్తున్న కాండం కుళ్లు తెగులు నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు.కార్యక్రమంలో వీఏఏలు సుష్మా, స్టెల్లీ, రైతులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేయాలి



యనమలకుదురులో నాయీబ్రాహ్మణ సంఘ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ నేతలు

పెనమలూరు: నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి అందరి సహకారం కావాలని ఏపీ నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ద్రాక్షారపు సూరిబాబు అన్నారు. యనమలకుదురు గ్రామంలో నాయీ బ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం సంఘ క్యాలెండర్‌ను సూరిబాబు, ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ సురవరపు నాగరాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసనకుర్తి ఈశ్వరరావు, తెలుగు నాయీబ్రాహ్మణ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆకునూరు సుబ్బారావు, సంఘ నేతలు నవిరి మహేష్, ద్రాక్షారపు రాము, డాక్టర్ అయోధ్య సత్యనారాయణ, గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, పి.సత్యనారాయణ, తెన్నేటి ప్రకాష్, అయోధ్య శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకోవాలంటూ యువతిపై దాడి

పెనమలూరు: తనను పెళ్లి చేసుకోవాలంటూ ఓ యువతిపై యువకుడు దాడి చేయటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు ఇందిరానగర్‌కు చెందిన యువతి (23) కుటుంబ సభ్యులతో ఉంటూ కానూరులో స్వీట్ షాపులో పని చేస్తోంది. గతంలో ఆమె ఇంటి ఎదురుగా ఉన్న చోటు అనే యువకుడు యువతి వెంటపడుతూ పెళ్లి చేసుకోవాలని వేధించసాగాడు. దీనికి యువతి నిరాకరించింది. ఈ నేపథ్యంలో చోటు సోమవారం యువతి పని చేస్తున్న షాపు వద్దకు వచ్చి యువతిని బయటకు పిలిచి పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేశాడు. యువతి నిరాకరించటంతో ఆమెపై దాడి చేసి గాయపరిచాడు. యువతి కేకలు వేయటంతో చోటు అక్కడనుంచి పారిపోయాడు. ఘటనపై యువతి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఉంగుటూరు: ఓ ఇంటిలో రహస్యంగా పేకాట శిబిరం నిర్వహిస్తున్న ఏడుగురు వ్యక్తులను ఉంగుటూరు పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మానికొండ గ్రామంలో కొందరు వ్యక్తులు నిర్మాణం జరుగుతున్న ఇంటిలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఉంగుటూరు ఎస్ఐ గోవింద తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.3310 నగదును స్వాధీనం చేసుకున్నారు.

దాళ్వా వరి నాట్లు ప్రారంభం



పునాదిపాడులో నాట్లు వేస్తున్న కూలీలు



గొడవర్రులో నాట్లకు సిద్ధంగా వరి నారుమడి

దాళ్వా వరి నాట్లు ప్రారంభమయ్యాయి. ఈ సీజన్‌లో దాళ్వా వరి సాగుకు అధికారికంగా అనుమతులు లేకపోయినా బోర్లు, నీటి సదుపాయం ఉన్న భూముల్లో రైతులు వరి నారుమడులు పోసుకున్నారు. ప్రస్తుతం నారుమడులు నాట్లకు సిద్ధంగా ఉన్నాయి. రెండు రోజులుగా జిల్లాలోని పలు గ్రామాల్లో దాళ్వా వరి నాట్లు చేపట్టారు. తెనాలి, గుంటూరు, బాపట్ల పరిసర ప్రాంతాలతో పాటుగా దివిసీమ నుంచి కూలీలు వలసలు వచ్చి వరి నాట్ల పనుల్లో పాల్గొంటున్నారు.